నదీనాం సాగరోగతిః

—బెహరా వెంకట సుబ్బారావు

అదొక చిన్న గ్రామం. ఆ గ్రామానికి మధ్యలో రోడ్డుకి ఆనుకొని రామకోవెల. ఆ కోవెలకు విశాలమైన వరండా. వరండా మధ్యలో భజన చెట్టు. సమయం రెండు గంటలు కావస్తోంది. రోహిణికార్తె. ఎండ నిప్పులు చెరుగుతోంది. వరండాలో నలుగురు గ్రామస్థులు కూర్చున్నారు గాలికోసం. ఎండల గురించి మాట్లాడుకొంటున్నారు. వడగాల్పులకి ఎక్కడెక్కడ ఎంతమంది చనిపోయారో చెప్పుకొంటున్నారు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఒక యువకుడు అంత ఎండలోనూ గబగబా అడుగులు వేసుకొంటూ తమవైపే రావడం గమనించారు. ఎవరో తెలియదు. అపరిచిత వ్యక్తి. ఆ చుట్టు ప్రక్కల గ్రామాలనుంచి బస్ ఎక్కడానికి ఆ గ్రామానికి వస్తూవుంటారు ప్రజలు.

కాళ్ళకి చెప్పులు లేకపోవడం వల్ల పాదాలు అంటుకొంటూ వుండే చిన్న సైజు పరుగు తీసి ఆ వరండా చేరుకొన్నాడు. ఒక స్తంభానికి ఆనుకొని కూర్చున్నాడు. అరికాళ్ళను చేతులతో రాసుకున్నాడు. అంతా అతని వైపు పరీక్షగా చూశారు. ఆ యువకుడు అలా వారు చూస్తూండగానే పక్కకి వొరిగిపోయాడు. ఆనలుగురూ చివాల్న లేచి అతణ్ణి సమీపించారు.

"ఏవూహ బాబూ?" ప్రశ్నించాడు ఒకడు. అతను పలక్క పోవడంతో "మొహంతిరిగింది కాబోలు!" అన్నాడు మరొకడు.

"మంచి నీళ్ళుగావాలాబాబూ?" అడిగాడు మూడోవ్యక్తి. మంచినీరు తేడానికి పరుగెత్తాడు నాలుగోవాడు.

ఆ యువకుడు పై జామా లాల్చీ వేసుకొన్నాడు. నల్లగా బక్కపల్చగా వున్నాడు. వయస్సు రమారమి యిరవై వుంటుంది. అతనిలో సంస్కారం అంతగా కనబడదు. అచేతనంగా పడివున్నాడు. అసిరయ్య చొరవ తీసుకొని అతని చొక్కా గుండీలు విప్పి వదులు చేశాడు. మిరియాలు వానను తీసి అత్రుతగా విసర సాగాడు.

"మంచినీళ్ళకెళ్ళిన నూకరాజింకా రాలేదు!" ఆలస్యం భరించలేక వాడు వెళ్ళిన వైపే చూస్తూ అన్నాడు తాతయ్యలు. సత్యంనాయుడు ముక్కు దగ్గర వేలెట్టి చూశాడు.

రామకోవెల్లో ఎవరో వ్యక్తి వడదెబ్బతిని పడిపోయాడన్న వార్త ఆ గ్రామం అంతా పాక్కిపోయింది. జనం బాగా మూగారు.

పరుగెత్తుకొంటూ చెంబుతో నీళ్ళు తెచ్చి అందించాడు కిష్టంనాయుడు. ఆ తర్వాత అతని వెనుకనే మరో చెంబుతో నీళ్ళు తెచ్చాడు నూకరాజు.

క్రిష్టంనాయుడు తెచ్చిన చెంబు అందుకొని "బాబూ!" అని పిలిచాడు సత్యంనాయుడు.

అతను పలక లేదు.

పక్కకు ఒత్తిగించాడు అసిరయ్య.

"దూరంగా వుండండేస్! గాలిరాగల్దు!"

చుట్టూ మూగిన జనాన్ని అదలించాడు క్రిష్టంనాయుడు. కానీ ఎవరూ లక్ష్య పెట్టలేదు. వింతగా చూస్తున్నారు.

అతని మొహం మీద నీళ్ళు చల్లి తన కండువాతో తుడిచాడు సత్యం నాయుడు.



అంతా ఆత్రుతగా చూడసాగారు, ఆ యువకుడు కొన్నిక్షణాల తర్వాత కళ్ళు తెరిచి అందర్నీ చూశాడు. చేతులుకూడ దీసుకొని అందరికీ నమస్కారం చేశాడు. అతని నోట్లో నీరు పోసాడు సత్యంనాయుడు. నాలుగు గుక్కలు మింగి యిక గుటకలు వేయలేక పోయాడు. నోట్లో నీరు బయటకు వచ్చేసింది. అతని తలను తన తొడ మీద పెట్టుకొన్నాడు అసిరయ్య

"నోరు చాపు బాబూ!" అన్నాడు. అతని స్వరం గద్గదమైంది.

"ఎక్కడికి వెళ్ళాలి బాబూ?" కంగారు పడుతూ అడిగాడు అప్పుడే వచ్చిన అప్పన్న దొర.

అతి కష్టం మీద కనురెప్పలుఎత్తాడా అభాగ్యుడు.

"అందరికీ మరోసారి నమస్కారంచేస్తూ వెంకన్న..." అని ఆగిపోయాడు.

"చచ్చిపోనాతంటావా, దద్దా?"

అనుమానంగా అడిగాడు సత్యంనాయుడు.

అసిరయ్య గాభరాపడ్డాడు.

"ఒరే నర్సిగా! అర్జంటుగా పోయి పంతులు డాక్టరుగార్ని పిలు!" పురమాయించాడు అప్పయ్య దొర.

పంతులు డాక్టరుగారంటే ఆ వూరి కరణం గారి అబ్బాయి. ఆ గ్రామంలో వున్న హాస్పిటలుకు డాక్టరుగారు.

"పంతులు డాక్టరుగారు మందుల కోసం పొద్దుటే పట్నం ఎళ్లారు బాబూ! ఇంకా రానేదు!"

చెప్పాడు కరణంగారి పాలికాపు నర్సిగాడు.

"మరయితే ఆచార్లుగార్ని పిలుచుకురా!"

తొందరచేశాడు అసిరయ్య. పరుగుతీసాడు నర్సి.

క్రిష్ణమాచార్యులుగారు ఆయుర్వేద వైద్యం చేస్తూ వుంటారు ఆ గ్రామంలో. ఆ వూరికి ఆసుపత్రి వచ్చాక ఆయన గిరాకీ తగ్గిపోయింది.

ఇంగ్లీషు వైద్యం మీద నమ్మకం లేనివాళ్లూ ఆయుర్వేద వైద్యంమీద బాగా గురివున్నవాళ్లూ [illegible] [illegible] వైద్యాన్ని గేలిచేసుకొంటూ వుంటారు.

ఎక్కడికి కెళ్లాలి బాబూ అనడిగితే 'వెంకన్న' అని ఆగిపోయాడు. వెంకన్నగూడెం ఎళ్లాలి గాబోలు!

తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసాడు తాతయ్యలు.

"వెంకన్నగూడెం అంటే హరిజనుడై వుంటాడు" అతని తలను పదిలంగా కింద పెడుతూ అన్నాడు అసిరయ్య.

"వెంకన్న గూడెంలోని వాళ్ళంతా హరిజనులే బాబూ! ఈడూ హరిజనుడై వుంటాడు!" అన్నాడు ఒకడు.

వారి మాటలతో అక్కడ గుమిగూడిన జనం కొద్దికొద్దిగా ఎడం కాసాగారు.

చేతిలో చిన్న పెట్టెతో అదరా బాదరా వచ్చారు కృష్ణమాచార్యులుగారు.

"బాబూ! ఈడికేవూరో తెలీదు! ఎండలో వచ్చి మాటా మంతీ లేకుండా పడిపోనాడు! రెండు గుటకలు నీళ్ళు తాగి తల వాల్చేసాడు! సూడండి బాబూ!"

ఆచార్యులుగారు అతని చేతిని ఎత్తి మరు క్షణంలోనే క్రిందికి వదిలేసి

"ప్రాణం పోయింది!" అన్నారు.

"ఈడిదేవూరో తెల్దు బాబూ!" అన్నాడు ఒకడు, అక్కడ మూగినవాళ్ళలో.

"ఏవూరేటిరా? సెప్పినాడు గదా ఎంకన్న గూడెం అని" గదమాయించాడు మరొకడు.

"అరిజనుణ్ణన్నాడు గదరా!" అన్నాడు ఇంకొకడు.

వారి మాటలకి షాక్ తిన్నారు ఆచార్యులు గారు.

"ఆఁ! హరి! హరి! హరిజనుడా! చెప్పారు గాదేమయ్యా? అతణ్ణి తాకి భ్రష్టుణ్ణయ్యాను! దించండి! రోడ్డుమీద పడేయండి. రామాలయంలో మృతదేహమా? దించండయ్యా! క్రింద పడేయండి! ముకుందా! మురారీ!"

"ఏవిటంటీ మీ గొడవ!" విసుక్కున్నాడు అంతవరకూ ఓపికపట్టి నిలబడి చూస్తున్న సత్యంనాయుడి మేనలుడు క్రిష్ణంనాయుడు.

"గొడవంటావేమిటయ్యా? హరిజనుడికి దేవాలయ ప్రాంగణాల్లోకి ప్రవేశమే నిషిద్ధమే! పైగా మృతదేహమా? చూస్తారేమయ్యా, క్రిందకి దించండి" కుపితులయ్యారు ఆచార్యులు గారు.

"అణ్ణి ఎలా తాకమంటారు బాబూ? కథ జాతివాడు! పైగా శవం!" తన అసమ్మతిని తెలియజేసాడు అసిరయ్య.

ఇక నిగ్రహించుకోలేకపోయాడు క్రిష్ణంనాయుడు

"అసిరయ్య మావా! మాటలు తిన్నగా రానీ! అతనూ మనలాంటి మానవుడే! అతని కులం ఏవిటో మొహంమీద రాసుందా? ఏ కులం వాడయితే మనకేం? కులాలతోనూ, మతాలతోనూ మనకి పనిలేదు! జీవితానికి చిట్ట చివరి ఘట్టం మరణం! బతికున్నంతకాలమూ వాళ్ళని కథజాతివారని వెలివేసి దూరంగా వుంచుతారు! నీచంగా చూస్తారు! మనిషి కన్నుమూశాక ఇక కులాలతో పనేటి మావా? శవానికి కులంతో ముడిపెడితే ఎలా?"

మొదట ఆవేశపడినా తగ్గు స్వరంలో ఆగాడు.

క్రిష్ణంనాయుడి మాటలు ఆచార్యులుగారికి చిర్రెత్తించాయ్.

"ఒరేయ్ కిష్టయ్యా! పట్నంలో చదువు మొదలుపెట్టి ఏడాది కాలేదు! అప్పుడే ఉపన్యాసాలు దంచేస్తున్నావ్! సంఘ సంస్కర్తవి కావాలనుకొంటున్నావా? ఇవన్నీ నీకు తెలియవుగానీ అలా పోయి నీ పనిచూసుకో!"

మందలించారు.

"ఆచార్లుగారూ! పెద్దవారనే గౌరవభావంతో ఊరుకొన్నా! ఈ మాటలేగానీ మా వాళ్ళెవరైనా అంటే...."

ఉద్రేకపడ్డాడు. మేనమామ సత్యంనాయుడు కలుగజేసుకోవడంతో ఆగిపోయాడు.

"ఒరేయ్ కిష్టయ్యా! పెద్దోరితో ఏవిటిరా ఆ మాటలు! కుర్రతుంటవి నీకేటి తెల్సురా!



మాలోళ్ళనీ మాదిగోళ్ళనీ మన గుమ్మాల్లోకే రానీయం! అలాంటిది ఆళ్ళ శవాల్ని మోస్తారంట్రా! నీకేమయినా మతిగానీ పోయిందా?"

మందలించాడు. మేనమామవైపూ ఆచార్యులుగారి వైపూ కోపంగా చూశాడు క్రిష్ణంనాయుడు.

"అనంతశయనా! అపచారం జరిగిపోయింది! ఇదిగో అసిరయ్యా! తలార్లని పిలిపించి వెంటనే శవాన్ని దింపించి దూరంగా పడేయించండి. ప్రెసిడెంటుగార్కి కబురు పంపిస్తే తతిమ్మా ఏర్పాట్ల విషయం ఆయన చూసుకొంటారు. నే పోయి స్నానం చేయాలి! అపరాహ్ణం దాటాక స్నానం! అచ్యుతా! జనార్దనా!"

తాను మైలపడినందుకు బాధపడ్డారు. కదలబోతూంటే పిలిచాడు క్రిష్ణంనాయుడు.

"ఇదిగో ఆచార్యులుగారూ! మీ గీతాచార్యులు ఏమన్నారో తెలుసా! ఏ ప్రాణినీ ద్వేషించక మిత్రత్వంతో మెలిగేవాడూ, దుఃఖితులు ఎడల జాలీ, కరుణా గలవాడూ మమకార అహంకారాలు లేనివాడూ మాత్రమే తనకు ప్రియమైన భక్తుడు అన్నాడు. అంతేగానీ సహస్రనామజపం చేస్తే చాలదు. జ్ఞప్తికి తెచ్చుకోండి భక్తియోగం!"

ఆశ్చర్యంగా చూశారు ఆచార్యులుగారు.

"గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్టుంది నీ పద్ధతి! ఇదిగో సత్యంనాయుడూ పెద్దలతో ఎలా మాట్లాడాలో తెల్సుకోమను నీ అల్లుణ్ణి! భగవద్గీత నాలుగు పేజీలు చదివితే చాలదని కూడా చెప్పు!"

"ఎటువంటివారిని పెద్దలుగా భావించి గౌరవించాలో కూడా అందులోనే చెప్పాడు అని చెప్పు మావా!" అందుకున్నాడు క్రిష్ణంనాయుడు.

"ఏటిరా తగువులు?" కలుగజేసుకొన్నాడు తాతయ్యలు.

"బాబూ ఆచార్లుగారూ! తమరెళ్ళండి! ఈడి సంగతి మేం చూసుకొంటాం!" అంటూ ఆచార్యులుగార్ని శాంత పరచ ప్రయత్నించాడు.

ఒకసారి కళ్ళురిమి కదిలారు ఆచార్యులుగారు.

"మనవూరిలోగా బద్ది సరిపోయింది. మరొక

చోటయితేనా ఇలా ప్రవర్తించినందుకు శ్రీకృష్ణ జన్మస్థానానికిపోయి చక్రధారిని స్మరించుకుంటూ కూర్చుని వుండేవారు!"

కసిగా విసురు విసిరాడు కిష్టంనాయుడు వెళ్తున్న ఆచార్యులు గారిని చూస్తూ.

"తలారి నారాయణ రానంటున్నాడు దద్దా!" వర్తమానం అందించాడు ఒకడు.

"ఏం? ఎందుకని? ఆడు కాకపోతే మరొకడు!"

విసుక్కున్నారు సత్యంనాయుడు.

"మున్సబుగారు చెబితే గానీ రాడేమో!"

సందేహం వ్యక్తం చేసాడు తాతయ్యలు.

"ఆళ్ల ధోరణి సూత్తుంటే మున్సబుగారు సెప్పినా పెసిడెంటుగారు సెప్పినా వచ్చేలా లేరు దద్దా! ఆళ్ళజాతి ఒకటే అయినాకులాలు వేరంట! ఆ చచ్చినాడి కులం ఏమిటో తెలుస్తే గాని రాకంట!" వివరంగా చెప్పాడు.

అంతలో ప్రెసిడెంటు వెంకన్న దొరగారు మున్సబుగార్ని, కరణంగార్ని వెంటబెట్టుకొని వచ్చారు.

"ఎవర్రా మా యింటికొస్తూ యిక్కడ పడిపోయాట్ట!" వస్తూనే అడిగారు దొరగారు.

అంతా ఆ గ్రామ పెద్దలకి దారిచ్చారు.

"బాబూ! తమరింటికా? వెంకన్న....అని అనేసి ఆగిపోతే వెంకన్న గూడెం హరిజను డనుకొన్నాం!" నొచ్చుకొన్నాడు అసిరయ్య.

శవాన్ని పరీక్షగా చూశారా పెద్దలు.

"పీడ్నెక్కడో చూసినట్టుందే! మా యింటికి ఎందుకొస్తున్నాడబ్బా!" పైకే అనేశారు వెంకన్న దొరగారు.

"బాబూ! తమరింటికని తెల్సిందిగాదు. వెంకన్నగూడెం హరిజనుడనుకొని...." సగంలోనే ఆగిపోయాడు సత్యంనాయుడు. తన ప్రవర్తనకు బిడియపడ్డాడు. ఆ తర్వాత భయపడ్డాడు.

"ఒరేయ్! మీరంతా అంటూంటే నాకెందుకని వూరుకొన్నా గానీ, ఆడు హరిజనుళ్ళా వున్నాడంట్రా? ఆళ్ళకి తెల్లటి బట్టలు గూడానా!"

అందుకొన్నాడు తాతయ్యలు.

"నా కనుమానమేసింది దద్దా! ఆడి ముఖ వచ్చస్సు సూత్తే దొరలబిడ్డలా లేడూ?"

వత్తాసు పలికాడు నూకరాజు.

"నేనంటూనే వున్నానురా! కానీ మీ రినిపించుకొంటేనా? [illegible] వెంకన్న గా... రింటికే ఎల్తున్నానని చెప్పబోయాడు! పూర్తిగా చెప్పలేకపోయాడు."

అన్నాడు మరొకడు.

వారి మాటలకి నవ్వుకొన్నాడు కిష్టంనాయుడు.

"దొరగారూ! ఇతని ఊరూ పేరూ మీకు తెల్సేవుండాలి! వాళ్ళవాళ్ళకి కబురు పంపితే వచ్చి అంత్యక్రియలు చేసుకొంటారు."

అన్నాడు మున్సబుగారు.

ఆలోచనలో పడ్డారు వెంకన్న దొరగారు.

"వాళ్ళవాళ్ళకి కబురు పంపడం చాలా అవసరం ప్రెసిడెంటుగారూ! సూర్యాస్తమయం అయితే శవ దహనానికి శాస్త్రం వొప్పుకోదు. తెల్లవార్లూ ఈ శవానికి కాపలా కాయాలి."

అన్న కరణంగారి మాటలకి మండిపడ్డాడు కిష్టంనాయుడు.

"బ్రతికున్నంతకాలమే ఈ మిడిసిపాట్లు! కులం అనీ, జాతీ అని! శవాన్ని అలా వదిలేస్తే కుళ్ళి కంపు కొడుతుంది! అనారోగ్యానికి, అంటురోగాలకీ కారణమవుతుంది! అందుకని శవాన్ని కాల్చడమో, పూడ్చడమో తప్పదు. ఒక్కో కులంవారు ఒక్కోలా చేస్తారు. అది ఆచారం అయి కూర్చుంది. ఆ శవాన్ని రాబందులు పీక్కుతిన్నా పర్వాలేదు. వాడు చూస్తాడా ఏమన్నానా? శవంయొక్క అవశేషాలు మిగలకుండా వుంటే చాలు! మనకన్నా ఆ రాబందులే నయం! శవం ఏ కులంది అని ఆలోచించకుండా తింటాయి. మనకున్న ఈ కుచ్చితపు బుద్ధి వాటికి లేదు!"

ఆ గ్రామ పెద్దలు ముగ్గురూ అతనివైపు ఆశ్చర్యంగా చూశారు. ఆ తర్వాత ఆగ్రహం ప్రవేశించింది వారిలో.

పరిస్థితి గమనించాడు సత్యంనాయుడు.

"వాడి మాటలకి లెక్క చేసుకోకండి



బాబూ' ఏటి మాటాడుతున్నాడో ఆడికే తెలీదు! పిచ్చోడు!"

శాంతింప ప్రయత్నించాడు.

"నీ మేనల్లుడు కదూ! పట్నంలో చదువు కొంటున్నాడు కదూ!" కిష్టంనాయుడ్ని నిశితంగా చూస్తూ అడిగారు వెంకన్నదొరగారు.

"అవును బాబూ! నాలుగు ముక్కలు చెప్పించి పిల్లనిచ్చి పెళ్ళి చేయాలను కొంటున్నా!"

వినయంగా అన్నాడు సత్యంనాయుడు.

"ఊఁ బాగానే చదువుకొంటున్నాడన్న మాట!"

కళ్ళజోడు సవరించుకుంటూ కరణంగారన్న మాటల్లో వేళాకోళం ధ్వనించింది.

ఆయన్ను విసుగింపుగా చూసి దృష్టిని మరల్చుకొన్నాడు కిష్టంనాయుడు.

కిష్టయ్య వ్యవహారం అంతటితో ఆపుచేయ ప్రయత్నించాడు అసిరయ్య.

"బాబూ! ఈతనిదేవూరో కలపీయండి. మనిషిని పంపిద్దాం!" అసలు విషయంలోకి దింపాడు.

"ఒరే కిష్టయ్యా! ఓసారి కళ్ళాని కెళ్ళు! పశువులొచ్చే యేళయింది! కుడితి పెట్టించి పాలు తీయించు! నాకు ఎల్లాసికి కుదరదు!"

పురమాయించాడు సత్యంనాయుడు అల్లుణ్ణి అక్కడనుంచి ఎలాగైనా పంపేయాలని.

"ఊఁ మానవత్వం లేని మనుషుల మధ్య తిరిగేకన్నా నోరులేని ఆ పశువుల మధ్య మసలితేనే మంచిది!" అనేసి విసురుగా పోతున్న కిష్టంనాయుడు వైపు చూస్తూ వుండిపోయారు ఆ ముగ్గురు పెద్దలూ.

"అసిరయ్యా! శవాన్ని దించి రోడ్డువారగా వుంచండి!" అన్నారు వెంకన్న దొరగారు.

అసిరయ్యా, సత్యంనాయుడూ, తాతయ్యలూ కల్సి ఆశవాన్ని దగ్గరలో నున్న పశువులపాకలో వేశారు.

మున్సబుగార్ని కరణంగార్ని కొంతదూరంగా తీసుకెళ్ళి నెమ్మదిగా అన్నారు వెంకన్న దొరగారు.

"పంతులుగారూ! వీడెవరో నాకూ తెలీదండి! మంచి చిక్కొచ్చిందే!"

ప్రెసిడెంటు దొరగారి మాటలకి ఆశ్చర్యపోయారు ఆ గ్రామాధికారు లిద్దరూ.

"అయితే కొంపదీసి హరిజనుడే అంటారా!"

అనుమానాన్ని వ్యక్తం చేసారు కరణం గారు.

"అయితే కావచ్చు! గట్టిగా అనకండి!" గుసగుసలాడారు దొరగారు.

"మరయితే పోలీసు రిపోర్టు యిద్దామా?" నెమ్మదిగానే అడిగారు మున్సబుగారు.

"పోలీసు రిపోర్టెందుకయ్యా! ఇదేమయినా హత్యా! ఆత్మహత్యా! నీ మున్సబు బుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు!"

చొరవగా అన్నారు ప్రెసిడెంటు గారు.

అంతలో పట్నం నుంచి వచ్చి ఆగింది బస్సు. డాక్టరుగారూ అతని తమ్ముడూ బస్ దిగారు. విషయమంతా వివరించారు పెద్దలు. డాక్టర్ గారు వచ్చారన్న సంగతి తెల్సి తిరిగి వచ్చాడు క్రిష్ణంనాయుడు.

పరీక్షించడానికి డాక్టరుగారు శవాన్ని తాక బోతూవుంటే గట్టిగా కేకేసారు కరణం గారు.

"ఒరేయ్ అబ్బాయ్! వాడి ప్రాణంఎప్పుడో పోయింది!" శవాన్ని తాక వద్దనే హెచ్చరిక ధ్వనించింది ఆయన కేకలో.

తండ్రి మాటల్ని లెక్కచేయలేదు డాక్టరు గారు. శవాన్ని పరీక్షించి.

"చనిపోయాడు అభాగ్యుడు!" అన్నారు.

"ఏవూరో ఏమిటో తెలియదు బాబూ!" అన్నారు దొరగారు.

"ఏకులమో తెలీక తికమకపడుతున్నాం!" చెప్పారు కరణంగారు.

"ఏంచేయాలో అర్థంగావడంలేదు బాబూ!" అయోమయంగా అన్నారు మున్సబుగారు.

ఆ మృత దేహాన్ని పరీక్షగా చూసిన మీదట "ఇతన్ని నాకుతెల్సు !" అన్నాడు డాక్టరుగారి తమ్ముడు వేణు.

"తెల్సా?" అన్నారంతా.

"ఆ తెల్సు!"

"ఏవూరు?"

"ఏకులం?"

"ఏంచేస్తూ వుంటాడు?"

"ఇక్కడ ఎవరింటికి వచ్చాడు?"

అంతా వరసగా ప్రశ్నలవర్షం కురిపించారు.

"ఏవూరో తెలియదుగానీ, ఒకటి మాత్రం తెల్సు! ఇది నాకు సరిగ్గా!"

"సరిగ్గా చెప్పి ఏడవరా!" విసుక్కున్నారు కరణంగారు.

"పోనీ కులం తెల్సా?" అడిగారు దొరగారు.

"ఆఁ తెల్సు!"

"ఏ కులం?"

"షెడ్యూల్డ్ కాస్ట్!"

"ఆఁ" నోరు వెళ్ళబెట్టారంతా.

"నీకెలా తెల్సురా! సరిగ్గా చెప్పు!"

కొడుకుమీద కసురుకొన్నారు కరణంగారు.

చెప్పడం మొదలుపెట్టాడు వేణు.

"క్రిందటివారం నేను హైదరాబాద్ ఇంటర్వ్యూకి వెళ్లానా?"

"అవును!"

"ఆ ఇంటర్వ్యూకి యితనుకూడా వచ్చాడు! ఇతనిది క్రిష్ణాజిల్లాలోని ఏదో వూరు చెప్పాడు జ్ఞాపకంలేదు!"

"కులంకూడా చెప్పుకొన్నాడా?"

విసుక్కున్నారు డాక్టరుగారు. అన్నయ్య చికాకును గమనించి నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టాడు. అంతా ఆసక్తిగా వింటున్నారు.

ఇంటర్వ్యూకి కాండేట్సుమంతా వరసగా కూర్చున్నాం. ఇతను నా పక్కనే కూర్చున్నాడు. అప్పుడు చెప్పాడు. తనది క్రిష్ణా జిల్లాలో ఓ గ్రామమనీ, షెడ్యూల్డు కాస్టువాడిననీ, తనకు తప్పకుండా ఉద్యోగం వస్తుందనే ఆశతో వున్నానని చెప్పాడు. పాపం ఉద్యోగం యింకా రాలేదు కాబోలు!" అని ఆగి జాలిగా శవంవైపు చూసాడు.

"వాడే వీడని గ్యారంటీ ఏమిటి?"

ఆరా తీయబోయారు మున్సబుగారు.

"నిశ్చయంగా అతనే! కావలిస్తే చూడండి! ఇతని కుడిచేతి చిటికెన వేలు తెగి మొండిగా వుంటుంది! వేలు ఎలా తెగిందని అడిగా. అప్పుడు తన కుటుంబ పరిస్థితినంతా చెప్పుకొన్నాడు. అతని తండ్రి బజారులో చెప్పులు కుట్టుకొని రోజుకి రెండూ మూడూ సంపాదిస్తూ వుంటాడుట. మనకి చదువు లెందుకురా కుల



వృత్తి చెప్పులు కుట్టుకొని బదుకుదాం అనేవాడుట. తనకి చదువుకోవాలని వుండేదట! తల్లి ప్రోత్సాహంతో ఎస్సెల్సీ వరకూ చదివాడుట బెజవాడలో. ఆ తర్వాత ఉద్యోగం కోసం తిరుగుతున్నానని చెప్పాడు. తండ్రి కుటుంబాన్ని బాగా చూసేవాడు కాదుట అతనికి తాగుడు అలవాటు వుందిట. ఓనాడు బాగా తాగి వచ్చి అన్నం పెట్టలేదని పెళ్లాం మీదికి కత్తితో వురికాడుట తల్లిని కాపాడ్డానికి అడ్డుగా వెళ్ళి తండ్రితో తలపడ్డాడుట. అప్పుడే అతని కుడిచేతి చిటికినవేలు తెగిపోయిందన్నాడు! ఇప్పుడు చూడండి. అతని చిటికెనవేలు మొండిగా వుంటుంది.

అంతా పరీక్షగా చూశారు. చిటికెనవేలు మొండిగా వుండటం గమనించారు.

"అయితే కిడజాతివాడన్నమాట!"

పైకే గట్టిగా అన్నారు వెంకన్నదొరగారు.

"బాబూ! ఎండలో వచ్చారు! ఉదయం నుంచీ భోజనంలేదు యింటికి పదండి!"

పిల్లల్ని యింటికి పంపేయాలని తాపత్రయ పడ్డారు కరణంగారు.

కిష్టంనాయుడు అందరిలోకి వచ్చాడు. "బాబు తవరెళ్ళి రండి! నే నిక్కడనే వుంటా!" అన్నాడు ధైర్యంగా.

ఒక్కొక్కరూ కదల నారంభించారు.

"మున్సబూ! ఈ గ్రామానికి అధికారివి నీవు! ఈ అనాధ శవానికి సంస్కారం చేయించే బాధ్యత నీదే!" అంటూ కదిలారు ప్రెసిడెంటుగారు.

అందరూ పోగా మున్సబుగారూ, కరణం, తలారి రాముడూ మాత్రం మిగిలారు. క్రిష్టంనాయుడు కొంచెం దూరంలో నిలబడి అంతా గమనిస్తున్నాడు. నిప్పులమీద నిలబడ్డట్లుగా ఫీలయారు కరణంగారు.

"మున్సబుగారూ! నేవస్తా! అబ్బాయి పట్నం నుంచి యిప్పుడే వచ్చాడు!" అంటూ కరణంగారు కూడా కదిలారు.

"ఒరేయ్ రావుడూ! మనకి తప్పదు! మరో నలుగుర్ని పిల్చి పీడ్ని తగలెట్టండి, పెద్దచెరువు

గట్టుమీద ఎండిన తుమ్మచెట్టుంది, దాన్ని కొట్టి తగలేయండి!"

తలారి రావులుకి పురమాయించి మున్సబు గారూ జారుకొన్నారు.

మున్సబుగారు దూరంగా వెళ్ళాక విసుక్కొన్నాడు రావులు.

"ఈయన మనుషుల్ని తీసుకొని రమ్మంటారు! ఎవరూ రానంటారు!" అని ఒక్క నిమిషం ఆలోచించి బయలు దేరాడు.

అందరూ వెళ్ళాక పది మంది యువకులు వచ్చి కృష్ణంనాయుడ్ని కలిసారు. వారిని శవం దగ్గర వుండమని బయలు దేరాడు క్రిష్ణంనాయుడు తిన్నగా కరణం గారింటికి వెళ్ళి వీధి గుమ్మంలో నిలబడ్డాడు.

డాక్టరుగారూ, తమ్ముడూ బయటకు వస్తూండగా,

"వూళ్ళో పెద్దలు చూసుకొనే విషయాలు మన కెందుకురా బాబూ! పొద్దుట్నుంచీ భోజనం చేయలేదు!"

వారించింది తల్లి.

తల్లిమాటలు వినిపించుకోకుండా వారు గుమ్మం దాటుతూండగా,

"ఎక్కడికిరా వెళ్తున్నారు?"

నిలదీసారు తండ్రి,

"శవదహనానికి ఏర్పాట్లు చేయాలిగా! వెళ్తున్నాం!"

ఆయేర్పాట్లన్నీ మున్సబుగారు చేస్తున్నారు! మీకేం సంబంధం లేదు! ముందు స్నానాలు చేయండి! శవాన్ని తాకారు!"

అధికారంతో కేక లేసారు.

"హుం శవాన్ని తాకితే స్నానం చేయాలి! హరిజనులను ముట్టుకుంటే స్నానం చేయాలి! అలా అయితే నా వృత్తిలో నిమిష నిమిషానికీ స్నానంచేయాలి నాన్నగారూ! ఈ అస్పృశ్యత అన్నది నా వృత్తికి సరిపడదు! జాతి మత కులాలతో ప్రమేయం లేకుండా సర్వ మానవాళికి సేవచేస్తానని మెడికల్ కాలేజీలో ప్రమాణంచేసి బయటకు వచ్చా! ఈ విషయంలో నా నిర్ణయం మారదు! నా వృత్తికి ద్రోహం చేయలేను నాన గారు!

"నీ వింత భ్రష్టుడవై పోతావని అనుకోలేదురా!"

కొడుకు మీద గుడ్లురిమారు.

"మేం చదువుకొనే రోజుల్లో ఎన్నో

జ్యోతి కొత్త చిరునామా

"జ్యోతి" కార్యాలయం ఇప్పుడు హైదరాబాద్‌లో పని చేయటం ప్రారంభించింది, జ్యోతితో అన్ని ఉత్తర ప్రత్యుత్తరాలూ కింది చిరునామాతో జరుపవలసిందిగా కోరుతున్నాము, —ఎడిటర్

జ్యోతి

సచిత్ర మాస పత్రిక

1-8-4/1/1, చిక్కడపల్లి

హైదరాబాదు—500020

ముఖ్య గమనిక : ఏజంట్లు డ్రాఫ్టులు, మనియార్డర్లుకూడా ఈ కొత్త చిరునామాకే పంపాలి.



శవాల్ని కోసి చూశాం! అవి ఏ కులానికి చెందినవో తెలీదు! అది మా కనవసరం. అందరి శరీరాలు ఒక్కలాగే వుంటాయ్. స్నానం చేయమని మీరెప్పుడూ దండించలేదు. స్నానం రెండుపూటలా చేస్తాను. కానీ మీ రన్నట్టు వారినెవరినో తాకినందుకూ మాత్రం కాదు, శవాల్ని ముట్టినందుకూ కాదు! శరీర పరిశుభ్రత కోసం! ఆత్మ శుద్ధిలేని ఆచారం ఎందుకు చెప్పండి?"

"నీవెన్ని చెప్పు! వాడి శవ దహనానికి మీరు హాజరు కావడానికి వీల్లేదు!"

తండ్రిగా శాసించారు.

"హరిజనులనీ, అంటరానివాళ్ళనీ తోటి మానవులను కించబరచడం, నీచంగా చూస్తూ దూరంగా వుంచడవూ మానవత్వం అనిపించుకోదు నాన్నగారూ!"

అన్న రెండో అబ్బాయి మాటలకి ప్రమాన్పడిపోయాడు తండ్రి.

"ఏరా? ఈ రోగం నీకూ అబ్బిందా?"

చిన్నకొడుకును గద్దించారు.

"మా ఆశయం మీకు రోగంగా తోస్తే మేం చేయగల్గిందేమీలేదు నాన్నగారు!

అంతలో కృష్ణమాచార్యులుగారు అడుగు పెడుతూ "ఏవిటి రఘుబాబూ! పెద్దగా ఉపన్యాసం దంచేస్తున్నారు!" అడిగారు ఆశ్చర్యపోతూ.

"ఆచార్యులుగారూ! దయచేయండి! దయచేసి యీ విషయంలో జోక్యం చేసుకోకండి! అన్నయ్య ఏమైనా అంటే ఆ తర్వాత మీరు బాధపడతారు!" హెచ్చరించాడు రెండో అబ్బాయి వేణు.

"చూడండి ఆచార్యులుగారూ! మేం చేయబోయే ఈ అంత్యక్రియలు ఒక అభాగ్యుని శవానికి కాదు! ఈ సంఘంలో గూడు కట్టుకొని వున్న అంటరానితనానికి.

డాక్టర్ రఘు మాటలుకూడా విన్న ఆచార్యులుగారు అవాక్కయిపోయారు. ప్రతిమలా నిలబడి వుండిపోయారు.

అన్నదమ్ములిద్దరూ బయటకు వెళ్తుంటే గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయారు కరణంగారు...

"ఇదంతా కిష్టంనాయుడి ప్రోత్సాహంలా వుంది! బయట నిలబడ్డాడు!"

అన్న ఆచార్యులుగారి మాటలు విని ఆలోచనలో పడ్డారు కరణంగారు.

"రండి సార్! దహనానికి ఏర్పాట్లు చేస్తున్నాం!"

ఆ అన్నదమ్ములిద్దర్నీ ఆహ్వానించాడు

కిష్టంనాయుడు.

అంతలో రావులు మరో నలుగుర్ని వెంట బెట్టుకొని వచ్చాడు అక్కడకి.

"తమరు తప్పుకోండి బాబూ! మేం తీసు కెళ్ళి దహనంచేస్తాం!" అడ్డుతగిలాడు రావులు.

అడ్డు తొలగలేదు కిష్టంనాయుడు.

రావులూ మీలో మీకే చిన్నచిన్న విభేదాలు వున్నాయ్! మీలో కులాలు వేరు, జాతులు వేరు! ఒకరింటిలో ఒకరు అన్నాలు తినరు! ఒకరికి ఒకరికి సంబంధం లేదంటారు. మీరే ఒకర్ని ఒకరు కించబరచుకొంటారు! అది మీలో వున్న బలహీనత! అదే ఐకమత్యం లేకపోవడం"

కిష్టంనాయుడి మాటకి సిగ్గు పడిపోయాడు రావులు. "చిత్తం! ఇకమీదలా వుండమండి!" అన్నాడు.

"తమరు తప్పుకోండి బాబూ!" అర్థించాడు మరొకడు.

కిష్టంనాయుడు ఒప్పుకోలేదు.

"మీ జాతివాడికి మీరు చేసుకోవడంలో ఏముందిరా? అనాథప్రేత సంస్కారం లోనే ముక్తి మోక్షమూ వున్నాయ్!"

అడ్డు తగిలాడు మున్సబుగారబ్బాయి పెద బాబు.

"మొదట్లోనే మీరు తప్పుతకుంటా వచ్చి వుండాల్సింది!" అన్నాడు క్రిష్టంనాయుడు.

యువకులంతా శవాన్ని తల్చడానికి వుపక్రమిస్తూవుంటే ఆఖరి సారిగా బ్రతిమా లాడు రావులు.

"మీరీపని చేశారంటే గ్రామ పెద్దలు మమ్మల్ని బతకనీయరు బాబూ! పొరబాటయింది క్షమించండి బాబూ!"

"మీకేం భయంలేదు! మేంవున్నాంగా!"

భరోసాయిచ్చాడు ప్రెసిడెంటుగారితమ్ముడు రామన్నదొర.

"ఇంతకీ అతని జేబులు తనికీచేసిచూశారా? ఏమైనా వివరాలు దొరుకుతాయేమో!" అడిగారు డాక్టరు గారు.

"ఏదిబాబూ! వాణ్ణిముట్టుకుందుకే అందరూ భయపడి పోయారు! నే బెబుదామనుకొన్నా గానీ నామాట పడ నిచ్చేరు గారు!" చెప్పాడు కిష్టంనాయుడు.

పెదబాబు చొరవచేసుకొని జేబులు తనికీ చేసి కొన్నిచిల్లర డబ్బులు మాత్రం బయటకు తీశాడు!" అతని ఆచూకి తెలిపే కాగితాలు ఏమీ దొరకలేదు.

"దురదృష్టవంతుడు!" అన్నారు డాక్టరు గారు.

శవాన్ని ఎత్తుకొన్నారు నలుగురు. ముందు డాక్టరుగారూ, వారితమ్ముడు వేణూ నడవగా వెంట అంతా బయలుదేరారు శ్మశాన వాటికకు.

కొంతదూరం వెళ్లాక వెనక్కు తిరిగిచూశాడు కిష్టంనాయుడు. తానూహించనంత జనం తరలివస్తూ వుండటంతో ఆనందోత్సాహాలు వెల్లువిరిశాయ్ అతనిలో.

"మనగ్రామ ప్రజల్లో మానవత్వం లేదు అనుకొనే వాణ్ణి! చూడండి బాబూ! వెనుకఎంత మంది వస్తున్నారో!" ఆశ్చర్యపోతూ డాక్టరు గారితో అన్నాడు.

డాక్టరుగారు కూడా ఆ జనాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

అంతా శ్మశానవాటిక చేరారు

డాక్టరుగారూ, మున్సబుగారబ్బాయి, పెద బాబూ, క్రిష్టంనాయుడూ స్వయంగా చితి పేర్చారు. చితికి అగ్ని ముట్టించాడు వెంకన్న దొరగారబ్బాయి. కొంతసేపటికి దహనకాండ పూర్తయింది.

ఆ శ్మశానానికి ఆనుకొని వున్న చెరువులో దిగి అంతా స్నానం చేయసాగారు.

చెరువు గట్టుమీద నిలబడి వున్న తలారి రావులు గట్టిగా కేకేసాడు, ఆనందంలో.

"డాక్టరు బాబూ! అటు చూడండి. ఎవ రెవరు వస్తున్నారో!"

అంతా అటువైపుచూశారు. తమకళ్ళను తామే నమ్మలేకపోయారు.

ఆచార్యులుగారూ, కరణం గారూ, మున్స బుగారూ, ప్రెసిడెంటుగారూ తదితరగ్రామ పెద్దలూ శ్మశానానికి తరలి వస్తున్నారు. పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ. నదీనాం సాగరో గతిః!

✱